క్రీడా లోకం.. విజయ విహారం

- టేబుల్ టెన్నిస్ పోటీల్లో సత్తా
- నగర క్రీడాకారులకు పతకాలు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయం

ప్రకాశంనగర్: నగర క్రీడాకారులు సత్తా చాటుతున్నారు.. గెలుపు జెండా ఎగురవేస్తున్నారు.. టేబుల్ టెన్నిస్ క్రీడలో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పతకాలు సాధిస్తున్నారు.. జాతీయ స్థాయి పోటీల్లోనూ విజయ కేతనం ఎగురవేసేందుకు తర్ఫీదు పొందుతున్నారు.. రాజమహేంద్రవరం నగరంలోని గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన తీగిరెడ్డి శ్రీప్రభాత్ సాయి జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 85వ అంతర్ రాష్ట్ర, యూత్ అండ్ జూనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున అండర్ -19 యూత్ బాయ్స్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా, వ్యక్తిగత విభాగంలో కూడా పాల్గొని జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశాడు. గత ఏడాది రాష్ట్రంలో జరిగిన వివిధ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లోనూ విజయం సాధించడం ద్వారా జాతీయ స్థాయి పోటీలకు శ్రీప్రభాత్ ఎంపికయ్యాడు. ఇదే అకాడమీకి చెందిన గిడుతూరి సిరి పావని, గిడుతూరి తాన్యశ్రీలు ఇటీవల ఇండోర్ (మధ్యప్రదేశ్)లో జరిగిన 85వ సబ్ జూనియర్ అండ్ క్యాడెట్ నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో పాల్గొని అర్హత సాధించారు. రాష్ట్రంలో జరిగిన వివిధ ర్యాంకింగ్ పోటీల్లో విజయం సాధించిన వీరు పాయింట్ల ఆధారంగా సిరి పావని సబ్ జూనియర్స్ (అండర్ 15) విభాగంలో స్టేట్ నంబర్ వన్‌గా, తాన్యశ్రీ క్యాడెట్ (అండర్ 13) విభాగంలో స్టేట్ నంబర్ త్రీగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన శ్రీప్రభాత్ సాయి

50 ప్లస్ విభాగంలోనూ సత్తా

యువకులే కాదు 50 ప్లస్ విభాగంలోనూ నగర ఖ్యాతి విస్తరిస్తోంది. విజయవాడ ఫన్ టైమ్స్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన 85వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ కోచ్ వీటీవీ సుబ్బారావు పాల్గొని 50 ప్లస్ పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి, డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 120 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొన్న ఈ టోర్నీలో ఈ ఘనత సాధించిన సుబ్బారావును జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వి.భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి తదితరులు అభినందించారు.



సాధించిన పతకాలతో గిడుతూరి సిరి పావని, తాన్యశ్రీ

ప్రభుత్వ సహకారం.. అదే మణిహారం

జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఎనలేనిది. వివిధ క్రీడల్లో రాణించే సత్తా ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి అన్నివిధాలా సహకారం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది. స్కూల్ గేమ్స్, ఆడుదాం ఆంధ్ర వంటి పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులకు ప్రోత్సహిస్తోంది. దీంతో పాటు ఖేల్ ఇండియా నిధులు రూ.20 కోట్లతో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసింది. నగరంలో ఇంటర్ నేషనల్ స్టాండర్స్‌తో ఒక ఇండోర్ స్టేడియం, ఒక క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ, వైఎస్సార్ సీపీ అర్బన్ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఇప్పటికే ప్రకటించారు. ఇది క్రీడాభివృద్ధికి దోహదపడనుంది.



సుబ్బారావుకు 50 ప్లస్ విభాగంలో బహుమతిని అందజేస్తున్న ఏపీటీపీ అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు

క్లుప్తంగా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ధవళేశ్వరం: ఇంటర్ మొదటి సంవత్సరం తొలి రోజు పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో మొత్తం 399 మందికి 361 మంది పరీక్ష రాశారు. 38 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కళాశాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్షలను సీఎస్‌కే రమేష్ బాబు, డీఓ పి.శ్రీనివాసరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

506 మందికి వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ-1 గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 506 మంది వైద్య సేవలు పొందగా, ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు జి.రోహిత, స్పెషలిస్ట్ వైద్యులు గౌస్‌బేగం, ఆప్తామాలిక్ ఆఫీసర్ డి.సాంబయ్య వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు ఉచితంగా మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

వడ్డీ మాఫీ పొందండిలా..

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో గృహ యజమానులంతా ఆస్తి పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుపై ప్రస్తుతమున్న వడ్డీని మాఫీ చేస్తూ జీఓ జారీ చేసిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బకాయి ఆస్తి పన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి మాత్రమే ఈ వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. పన్నులను నగరపాలక సంస్థ కార్యాలయ కౌంటర్లు, వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు.

ఆర్బీకేల్లో పంట నమోదు వివరాలు

కడియం: ఈ- క్రాప్ ద్వారా నమోదు చేసిన పంటల వివరాలను ప్రతి గ్రామంలోని ఆర్బీకేల వద్ద అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి ద్వారకాదేవి తెలిపారు. ఈ జాబితాలో నమోదైన రైతులు తమ భూమి విస్తీర్ణం, పంట తదితర వివరాలను సక్రమంగా ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోవాలని అన్నారు. ఒకవేళ మార్పులు, చేర్పులు ఉంటే మూడు రోజుల్లో తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని మార్పు చేసేందుకు వీలుంటుందన్నారు.

సాంబశివరావుకు పీహెచ్‌డీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆర్.సాంబశివరావు వీసీ ఆచార్య కె.పద్మరాజు చేతుల మీదుగా పీహెచ్‌డీని శుక్రవారం అందుకున్నారు. ద్రవిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్‌కేఎం బాబూరావు చౌదరి పర్యవేక్షణలో 'తూర్పు గోదావరి జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యంపై ఒత్తిడి - ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ద్రవిడ యూనివర్సిటీ (కుప్పం) ఆయనకు పీహెచ్‌డీ అందజేసింది.

నేడు విశ్వకర్మ పథకంపై అవగాహన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై శనివారం అవగాహన కల్పించనున్నట్లు జిల్లా ఫెసిలిటేషన్ అధికారి చంద్రమౌళి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర జనరల్ మార్కెట్ వద్ద ఆర్ కన్వెన్షన్‌లో ఉదయ 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అవగాహన కల్పిస్తామన్నారు. మీ సేవా కేంద్రాల ద్వారా అక్కడికక్కడే రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ కోసం ఆధార్, రేషన్, బ్యాంక్ ఖాతా బుక్ తీసుకు రావాలన్నారు.

ఎంఈఓగా మణికుమార్ బాధ్యతల స్వీకరణ

కడియం: స్థానిక మండల విద్యాశాఖ అధికారిగా మణికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోరుకొండ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన లజపతిరాయ్ ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. ఈ స్థానంలో మణికుమార్ బాధ్యతలు స్వీకరించగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందించారు. కాగా ఎంఈఓ-2గా నాగేశ్వరరావు కూడా ఇక్కడ విధుల్లో ఉన్నారు.

తప్పులు ఉంటే సరిచేయించుకోండి

రాజమహేంద్రవరం రూరల్: ఈ-క్రాప్ సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాలో గ్రీవెన్స్‌కు ఈ నెల 5వ తేదీ వరకూ గడువు ఇచ్చారని మండల వ్యవసాయాధికారి ఎ.భీమరాజు అన్నారు. శుక్రవారం రాజవోలు రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ సామాజిక తనిఖీ కోసం ముసాయిదా రబీ 2023-24 జాబితా రైతుల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదులో తప్పిదాలు ఉంటే వివరాలను నమోదు చేశామన్నారు. ఇందులో ఏదైనా తప్పుగా నమోదు చేసి ఉంటే ప్రభుత్వం సోషల్ ఆడిట్‌లో రైతులకు మార్చుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ఈ గ్రీవెన్స్ శుక్రవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ గడువు ఇచ్చిందన్నారు. తదుపరి ఫైనల్ లిస్టును 8న తేదీ రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.దుర్గబాబు, గ్రామ ఉద్యాన సహాయకులు కె.మౌని పాల్గొన్నారు.



ఈ-క్రాప్ ముసాయిదా జాబితా విడుదల చేస్తున్న వ్యవసాయాధికారి భీమరాజు, రైతులు

టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా 'తనుబుద్ధి'

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యదర్శి తనుబుద్ధి సూర్యభాస్కరరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన పత్రాన్ని టెలికం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు అందజేశారు. ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజశేఖర్ బాబు, బి.శ్రీనివాస్, మార్కెటింగ్ ఎస్‌డీఈ కృష్ణ, పీఆర్‌వో బీఎస్ఎన్ఎల్ వాసు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యభాస్కరరావుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తనుబుద్ధి మాట్లాడుతూ బీజేపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. ఈ పదవి రావటానికి కారకులైన పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.



టెలికం జీఎం పలివెల రాజు చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న సూర్యభాస్కరరావు

సంక్షేమమే వైఎస్సార్ సీపీకి బలం

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- మళ్లీ ముఖ్యమంత్రి జగనన్నే

రాజమహేంద్రవరం సిటీ: పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి బలమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని 24వ డివిజన్ నల్ల మందు తదితర ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలని అన్నారు. నగరంలో ఇంత అభివృద్ధి జరిగిందంటే దానికి జగనన్న సహకారం, ప్రోత్సాహమే కారణం అని అన్నారు. రాజమహేంద్రవరం అంటే ముఖ్యమంత్రికి ప్రత్యేక అభిమానమని, సీఎంఆర్ఎఫ్ నిధులు ఎంతో మందికి అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేశారన్నారు. గత టీడీపీలో బాధితులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకే పథకాలు మంజూరు అయ్యేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో విశ్వ నగరంగా నిలుపుతానన్నారు. అనంతరం పలువురికి ఆయన పింఛన్ల సొమ్మును అందించారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ ఇన్‌చార్జి అరవ సురేష్ కుమార్, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్‌కుమార్, మద్దు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

ప్రశాంతంగా టెట్

ప్రకాశంనగర్: నగరంలో టెట్ ప్రశాంతంగా జరుగుతుందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక లూథర్‌గిరిలో ఉన్న ఇయాన్ డిజిటల్ జోన్ సెంటర్‌లో ఉదయం 730 మందికి 688 మంది, మధ్యాహ్నం 730కి 685 మంది హాజరయ్యారు.

ఎంపీ భరత్‌పై దుష్ప్రచారం చేయొద్దు

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని అభివృద్ధి పథాన తీసుకువెళ్లిన ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని, ఆదిరెడ్డి అవినీతి బాగోతం బయటపెడతానని ఏపీ పేపరుమిల్లు కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ చౌదరి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులకు రాజకీయ గురువు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అని, అతనికే పంగనామాలు పెట్టిన ఘనులన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆదిరెడ్డి అప్పారావు ఎమ్మెల్సీ పదవి తీసుకుని, తర్వాత టీడీపీలో చేరిన అవకాశవాది అని ప్రవీణ్ ధ్వజమెత్తారు. సైకిల్‌పై సామాన్య వ్యక్తిగా జీవనం సాగించిన అతను, నేడు వందల కోట్లు సంపాదించాడంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. ఎంపీ భరత్‌రామ్ చేస్తున్న అభివృద్ధిపై ఆరోపణలు మాని ఆధారాలతో నిరూపించాలన్నారు. ఆదిరెడ్డి అవినీతిపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తామని అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా భరత్‌రామ్ విజయం సాధించడం ఖాయమన్నారు. పార్టీ నాయకులు కొల్లి వినయ్, బిల్డర్ చిన్నా, గారా చంటి, ఉప్పునూరి దుర్గాప్రసాద్, ఉదయ్ రాణా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపు 'పచన కవితలు' ఆవిష్కరణ

సీటీఆర్ఐ: ప్రముఖ కవి, కథకుడు కవితాప్రసాద్ రచించిన 'పచన కవితలు' పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 9.45 గంటలకు జరుగుతుందని కళాగౌతమి సంస్థ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 'అసమాన అవధాన సార్వభౌమ' డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ కవితా సంపుటిని ఆవిష్కరిస్తారని తెలిపింది. కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి అధ్యక్షత వహించే ఈ సభలో పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని, సాహితీ అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆటో కార్మికులకు అండగా ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ: ఆటో కార్మికులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని గోకవరం బస్టాండ్ సమీపంలో సుబ్రహ్మణ్యం మైదానం వద్ద మహాత్మా గాంధీ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆటో స్టాండ్‌ను వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నగరంలో అన్ని రంగాల కార్మికులకు అందుబాటులో ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన అభివృద్ధిని వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి అజ్జరపు వాసు, నక్కా శ్రీనగేష్, కాంతారామ్ పాటిల్, ఆటో ఓనర్స్, డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో స్టాండ్ ప్రారంభోత్సవంలో ఎంపీ భరత్‌రామ్

బోధనోపకరణ కిట్ల పంపిణీ

ప్రకాశంనగర్: స్థానిక ఎస్‌వీఆర్ స్కూల్‌లోని భవిత ఉప కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి బోధనోపకరణాల కిట్లను విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐడీ (ఇంటలెక్చువల్ డిజెబిలిటీ) ఉన్న విద్యార్థులకు ఈ కిట్లు ఎంతో ఉపకరిస్తాయన్నారు. కాంపోజిట్ రీజినల్ సెంటర్ నెల్లూరు వారిచే దాదాపు రూ.12 వేల విలువైన 20 కిట్లు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ కిట్లలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన చిత్రాలున్న పుస్తకాలు, మెదడుకు పదునుపెట్టే ఆట వస్తువులు, పజిల్స్ వంటివి ఉన్నాయన్నారు. కాంపోజిట్ రీజినల్ సెంటర్ నెల్లూరుకు చెందిన ఆడియాలజిస్ట్ బి.శ్రీకాంత్, ఐ కోఆర్డినేటర్ ఎన్.కనకబాబు పాల్గొన్నారు.



బోధనోపకరణాల కిట్లను అందజేస్తున్న సుభాషిణి తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో మార్పులు, చేర్పులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న రూరల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్.తేజ్ భరత్ తెలిపారు. శుక్రవారం దీనిపై జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించే క్రమంలో నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌పై రాజకీయ పార్టీల సమక్షంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. రూరల్ పరిధిలో 264 పోలింగ్ కేంద్రాల్లో 85 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పులు, చేర్పులు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 1,500 పైబడి ఓటర్లు కలిగిన మూడు పోలింగ్ కేంద్రాలను ఏ, బీగా వర్గీకరణ చేసేందుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.మురళీధర్ (కాంగ్రెస్), తాటికొండ విష్ణుమూర్తి (వైఎస్సార్ సీపీ), యానాపు యేసు (బీజేపీ), కె.వెంకటేష్ (టీడీపీ), కె.రామకృష్ణ (సీపీఐ(ఎం), వి.కొండలరావు (సీపీఐ), రూరల్ తహసీల్దార్ వై కేవీ అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్ ఎమ్‌కే సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

సీతానగరం: బొబ్బిల్లంక గ్రామంలో సారా బట్టీలపై దాడి చేసినట్లు సీతానగరం ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం ఆ గ్రామ లంక భూముల్లో సారా బట్టీలపై దాడి చేసి 400 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఐదు వేల లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు వస్తున్నారని గమనించిన సారా తయారీ బట్టీ నిర్వాహకులు పరారయ్యారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ వివరించారు. గ్రామాల్లో సారా తయారీదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

మండల పరిషత్ ఏఓ చంద్రరావు బదిలీ


కడియం: స్థానిక మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.చంద్రరావు కాకినాడ జిల్లా గండేపల్లికి బదిలీ అయ్యారు. సుదీర్ఘ కాలం పాటు ఇక్కడ ఏఓగా పని చేసిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా గండేపల్లి మండల పరిషత్ ఏఓగా బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం చంద్రరావు రిలీవ్ అయ్యారు. అక్కడ పని చేస్తున్న పీవీ సుబ్బారావు కడియం మండలానికి వచ్చారు.

మద్దతు ఇవ్వాలని అభ్యర్థన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల కూటమికి మద్దతు ఇవ్వాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్‌లో టీడీపీ న్యాయవాదుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

రాజానగరం: ఆల్ ఇండియా అండ్ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థినులు సత్తా చాటారు. డీఆర్‌కే రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ (కాకినాడ)లో డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫస్టియర్ చదువుతున్న వెయిట్ లిఫ్టర్లు, అక్కాచెల్లెళ్లు బైరెడ్డి రాజేశ్వరి, చంద్రికలు వెయిట్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ 45 కిలోల కేటగిరీలో బైరెడ్డి రాజేశ్వరి, ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ 49 కిలోల కేటగిరీలో బైరెడ్డి చంద్రిక ఈ ఘనతను సాధించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యూనివర్సిటీకి రెండు మెడల్స్ సాధించడం హర్షణీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో బ్రాంజ్ మెడల్స్ అందుకున్న విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

ముందుంది ఆపాద



బొమ్మూరులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పచ్చని పొదలు

ప్రమాదం పచ్చని పొదలా అల్లుకుపోయింది.. బొమ్మూరులోని బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాలు ఆవరణ వద్ద పరిస్థితి ఇది. ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పచ్చని పొదలు గుబురుగా పెరిగాయి. అర్ధరాత్రి సమయాల్లో ఆ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు పడడంతో ఒక్కసారిగా ఎండిన తుప్పలు అంటుకుంటున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లో రెండు గ్రామ సచివాలయాలు నడుస్తున్నాయి. పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పిల్లలు సాయంత్రం సమయంలో ఆడుకుంటూ ఉంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో విష కీటకాలు సంచరించే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆ పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–రాజమహేంద్రవరం రూరల్

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
గోకవరం బస్టాండు దగ్గర, రాజమండ్రి-533104, ఫోన్ నెం.0883-2475681

స్వాధీనతా ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తుల కొరకు)

దిగువ సంతకందారుడు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ ఆర్యాపురం రాజమండ్రి అధీకృత అధికారి వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న ఋణగ్రహీత / హామీదారులకు నోటీసులో తెలిపిన బకాయి నోటీసు అందిన 60రోజుల లోగా చెల్లించమని కోరుతూ ఈ దిగువ తెలిపిన తేదీన డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది.

సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీతలు చెల్లించనందు వలన క్రింద వివరించిన ఆస్తులను సదరు నిబంధనలులోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని ఈ దిగువ తెలిపిన తేదీన క్రింది సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డ్ ఆస్తుల విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సబ్ సెక్షన్ (8) తో సెక్షన్ 13 లోని నిబంధనలు గమనించగలరు.

సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆస్తులతో వ్యవహారం చేసినచో ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం మరియు దానిపై గల వడ్డీ మొత్తాలకు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ ఆర్యాపురం రాజమండ్రి వారి ఛార్జికి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీతలకు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

నోటీసు, ఋణగ్రహీత/ హామీదారు / సహ-దరఖాస్తుదారు & స్థిరాస్తుల వివరములు

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్-స్వరాజ్ నగర్ బ్రాంచ్

1) ఋణగ్రహీతల పేర్లు : 1) శ్రీ కుందలి రాము (103897), తండ్రి : అబ్బాయ్ అలియాస్ ఉప్పలయ్య, డి.నెం.21-1-2/4, ఆశ్రమం వీధి, ఎ సి గార్డెన్స్, రాజమండ్రి, తూ॥గో॥ జిల్లా. 2) శ్రీ కుందలి సత్తిబాబు (103898), తండ్రి : రాము, డి.నెం.21-1-2/4, ఆశ్రమం వీధి, ఎ సి గార్డెన్స్, రాజమండ్రి, తూ॥గో॥ జిల్లా.
బకాయి సొమ్ము : మార్ట్గేజ్ లోన్ ఖాతా నెం.8472 కు తేది.18.10.2023 నాటికి రూ.13,06,505/- (అక్షరాలా పదమూడు లక్షల ఆరు వేల ఐదు వందల ఐదు రూపాయలు మాత్రమే) మరియు తేది.19.10.2023 నుండి తదుపరి వడ్డీ, కాస్ట్స్/ఖర్చులు.
డిమాండ్ నోటీసు తేది : 21.10.2023 స్వాధీనం తీసుకున్న తేది : 27.02.2024
స్థిరాస్తి వివరములు : షెడ్యూల్-ఎ : తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల, ఆల్కాట్ గార్డెన్స్, వార్డు నెం.2, ఆశ్రమం వీధి బ్లాక్ నెం.28, టి ఎస్ నెం.1059, (Bno.19,WW No.1) డోర్ నెం.2-1-2/4 తో నైరుతి మూలాన మొత్తము 200 చ॥గ॥లలో 49.43 చ॥గ॥లు లేదా 41.58 చ॥మీ॥ల ఖాళీ స్థలం అందుగల నిర్మాణాల యొక్క దస్తావేజు నెం.3167/1999, తేది.12.07.199 ప్రకారం యావత్తు ఆస్తి అన్ని ఈజుమెంటరీ హక్కులతో సహా.
హద్దులు : తూర్పు : రాజావీధి - 36.00 అ॥లు, దక్షిణం : కాశి వీర్రాజు గారి గోడ - 33.60 అ॥లు, పడమర : బడుగు సాహెబ్ గారి ఇంటి స్థలం - 36.00 అ॥లు, ఉత్తరం : రాజా వీధి - 33.60 అ॥లు.
ఈ హద్దులలో 49.43 చ॥గ॥లు లేదా 41.58 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు అందలి అన్ని ఈజుమెంట్ హక్కులతో సహా.

తేది : 27.02.2024
ప్రదేశం : రాజమండ్రి
సం/- అధీకృత అధికారి
ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్